






కురుస్తున్న భారీ వర్షం


కారేపల్లిలో..

# ఉదయం ఉడికించి..
# సాయంత్రం చల్లబడి

- రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు
- పమ్మిలో 44.9 డిగ్రీలు, అశ్వాపురంలో 44.5 డిగ్రీలు
- ఎండ తీవ్రతకు తల్లాడ సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్
- ఇరు జిల్లాల్లో సాయంత్రం పలుచోట్ల గాలివాన బీభత్సం
- పిడుగుపాటుతో వేర్వేరు చోట్ల మూడు పశువులు మృతి

ఖమ్మం/కొత్తగూడెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం సాయంత్రం పలుచోట ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పగలంతా తీవ్ర ఎండకొట్టగా సాయంత్రానికి వాతావరణ పూర్తిగా మారిపోయింది. వాతావరణశాఖ ప్రకటించిన గణాంకాల ప్రకారం ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే మండలం బాణాపురంలో 44.5డిగ్రీలు నమోదు కాగా.. ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ ప్రాంతంలో 44.7డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు తల్లాడ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలి లైన్‌మన్ పూసల లింగాచారికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇక సాయంత్రం కాగానే వాతావరణ పూర్తిగా మారిపోయింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరం, మధిరతోపాటు, మరి కొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కూసుమంచి గ్రామ శివారులో పొలాల వద్ద పిడుగుపడగా ఎలాంటి నష్టం చోటు చేసుకోలేదు. కారేపల్లి మండలం గిద్దెవారిగూడెం గ్రామ సమీపంలో ఇల్లెందు- ఖమ్మం ప్రధాన రహదారిపై చెట్టు కూలీ అక్కడ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై పడటంతో కొంత మేర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తల్లాడలో ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కారేపల్లి మండలం బొక్కల తండా గ్రామంలో చేలో మేతమేస్తున్న ఆవుపై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంతోపాటు పాల్వంచ, చంద్రుగొండ, మణుగూరు, జూలూరుపాడు, సుజాతనగర్, అశ్వారావుపేట, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి ఇల్లెందు, ములకలపల్లి తదితర మండలాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. కరకగూడెం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. కరకగూడెం, అనంతారం, పద్మాపురం, గొళ్లగూడెం, మోతే భట్టుపల్లి, కలవల నాగారం గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యం తడిచి పోయింది. కన్నాయిగూడెంలో 20 ఇళ్లపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. భారీ వృక్షాల విరిగిపోయి కరెంట్ తీగలపై పడిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇల్లెందు, జూలూరుపాడు, కొత్తగూడెంతోపాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కరకగూడెం మండలం రేగుళ్ల గ్రామంలో గోగు రాంబాబు అనే రైతుకు చెందిన రెండు ఎడ్లు పిడుగుపాటుతో మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

## ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం


కరకగూడెంలో ధాన్యం కల్లంలో పట్టాలపై నిలిచిన వర్షం నీరు



# జో అచ్చుతానంద..

- కల్యాణ రాముడికి వైభవంగా ఊంజల్‌సేవ
- భద్రాద్రిలో రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు
- 24 నుంచి నిత్య కల్యాణాల పునరుద్ధరణ

భద్రాచలం, ఏప్రిల్ 21: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఉయ్యాలను ఏర్పాటు చేసి ఆవాహన చేశారు. అనంతరం శ్రీసీతారామచంద్ర లక్ష్మణ స్వాములను ఉయ్యాల్లో ఆసీనులను చేసి భక్తరామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను దేవస్థానం హరిదాసులు ఆలపించారు. ఇదే సమయంలో ప్రత్యేక హారతులు సైతం స్వామివారికి సమర్పించారు. అనంతరం సింహ వాహనంపై శ్రీసీతారామచంద్రస్వామి వారికి తిరువీధిసేవ నిర్వహించారు.

### రేపటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

భద్రాచల సీతారాములకు మంగళవారం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కల్యాణం జరిగిన తరువాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కాగా స్వామివారు సాయంత్రం గజ వాహనంలో తిరువీధిసేవకు తరలివెళ్లనున్నారు. మంగళవారం చక్ర తీర్థం, పూర్ణాహుతి, శేష వాహనసేవ, ధ్వజా అవరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం నుంచి నిత్య కల్యాణాలు పునరుద్ధరించనుండగా దర్బారు సేవలు సైతం ప్రారంభించనున్నారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు 7

నిరుపయోగంగా నీటితొట్లు
- గొంతెండుతున్న పశువులు 7

ఆకుపచ్చగా భగీరథ నీరు
- వైరాలో రంగుమారిన తాగునీటి సరఫరా 7

# నేడా.. రేపా?

- ఖమ్మం అభ్యర్థి ప్రకటనపై కాంగ్రెస్ శ్రేణుల ఎదురుచూపు
- నామినేషన్‌కు గడువు సమీపిస్తున్నా.. తేల్చని అధిష్ఠానం
- 'హస్తం'లో తొలగని సందిగ్ధం

ఖమ్మం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటనలో అదే సందిగ్ధం.. ఉత్కంఠ కొనసాగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించకపోవడంతో శ్రేణుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఖమ్మం లోక్‌సభ స్థానంలో ఇప్పటికే బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు నామినేషన్ దాఖలు చేసి ప్రచారం చేస్తుండగా.. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ప్రచారం ముమ్మరం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రతిరోజు అభ్యర్థి ప్రకటనపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. "ఈరోజు ప్రకటిస్తారు.. లేదు రేపు ప్రకటిస్తారు" అంటూ ఆశ నిరాశల్లోనే వారికి కాలం గడిచిపోతోంది. దీంతో కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొంది. ఇతర పార్టీలు ప్రచారంలో ముందుకు సాగుతుండగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాత్ర తమ అభ్యర్థి ఎవరో తెలియక తలపట్టుకుంటున్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రుల కుటుంబీకులు పోటీ పడుతుండగా ఇతర జిల్లాల వారు కూడా ఖమ్మం టికెట్ ఆశిస్తుండడంతో అధిష్ఠానం అభ్యర్థిని తేల్చలేని పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీలను దృష్టిలో ఉంచుకుని అందరి దృష్టి ఖమ్మం లోక్‌సభ టికెట్ పైనే పడింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల కుమారుడు యుగంధర్, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి పేర్లతోపాటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్ తదితరులు ఖమ్మం టికెట్‌కోసం పోటీలో ఉండగా అనూహ్యంగా మంత్రి పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేర్లు తెరపైకి వచ్చాయి. దీంతో వీరిద్దరి పేర్లు కూడా కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తోంది. మంత్రుల కుటుంబాల నుంచి టికెట్ ఇవ్వని పక్షంలో ఈ ఇద్దరి పేర్లు పరిశీలనలో ఉండే అవకాశం ఉంది. వీరిలో ఒకరికి టికెట్ వస్తుందని జిల్లాలో గత రెండురోజులుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. నామినేషన్ల గడువు 25వ తేదీతో ముగుస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్న విషయాన్ని అధిష్ఠానం ఇంకా గోప్యంగానే ఉంచుతోంది. నేడోరేపో అధికారికంగా ప్రకటన వస్తుందని పార్టీ కేడర్ ఆశగా ఎదురుచూస్తోంది.

## బీఆర్ఎస్‌ది సంక్షేమ పాలన..
# కాంగ్రెస్‌ది సంక్షోభ పాలన

- హామీలు అమలు చేయలేకనే డైవర్షన్ రాజకీయాలు
- మంత్రి తుమ్మలపై దాడికి వ్యూహంపై విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ ఎంపీలు నామా, వద్దిరాజు, మాజీమంత్రి పువ్వాడ


మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుంటే కాంగ్రెస్ మాత్రం రాష్ట్రంలో సంక్షోభ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని ఖమ్మం ఎంపీ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో నేతలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ హామీలను అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి వ్యూహం జరిగిందన్న విషయంపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన 120 రోజుల్లో ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. దీన్ని గుర్తించే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు ఫోన్ ట్యాపింగ్‌లు, దాడులు వంటి అంశాలను ప్రచారంలోకి తెస్తున్నారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి వ్యూహంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే సీబీఐతో కూడా విచారణ జరిపించాలని సూచించారు. ఖమ్మంలో సుపారీలు ఇచ్చి దాడులు చేయించే సంస్కృతి లేదన్నారు. 1980కి పూర్వం వామపక్షాలకు, కాంగ్రెస్‌కు మధ్య ఘర్షణలో ఎవరైనా ఒకరు చనిపోతే దానికి ప్రతి దాడులు ఉండేవన్నారు. కానీ గత 40ఏళ్లుగా జిల్లాలో రాజకీయాలు ప్రశాంతంగానే ఉన్నాయన్నారు. ముగ్గురు మంత్రులున్నా జిల్లాలో సమస్యలు పరిష్కరించలేకపోతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏదో జరిగిందని, ప్రచారంచేసి ప్రజల్లో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత సృష్టించారన్నారు. ఆతర్వాత గొర్రెల స్కాం అంటూ ప్రచారం చేశారని, ఫోన్ ట్యాపింగ్ పేరుతో కొంతకాలం ప్రజలను డైవర్ట్ చేశారన్నారు. ఇప్పుడు హత్యలకు వ్యూహాల పేరుతో కొత్తడ్రామా చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం లోక్‌సభ స్థానానికి అభ్యర్థి ఎవరో కూడా తేల్చుకోలేని స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికస్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ఖమ్మంలోనూ బీఆర్ఎస్‌దే విజయమన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈనెల 29, 30తేదీల్లో ఖమ్మం జిల్లాలో ఎన్నికల ప్రచారానికి రాబోతున్నారని తెలిపారు. సమావేశంలో ఖమ్మం నగర అధ్యక్షుడు నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్
- ఏర్పాట్లపై సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 21: ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం సహాయ రిటర్నింగ్ అధికారులతో లోక్‌సభ సాధారణ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ అనంతరం ఈవీఎంలు ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూంలకు తరలించినట్లు తెలిపారు. మే, 3, 4వ తేదీల్లో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్, కమీషనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనింగ్‌పై అభ్యర్థులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో చేపట్టాలన్నారు. 25వ తేదీనుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలన్నారు. రెండురోజుల్లో జిల్లాకు ఎపిక్ కార్డులు రానున్నాయని వాటిని సత్వరమే పంపిణీ చేయాలన్నారు. మే, 3వ తేదీ నుంచి హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మే, 3న ప్రారంభం కానున్ననేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మంజూరు పనులు ఈనెల 23లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మే 1, 2, 6, 7 తేదీల్లో పోలింగ్ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూంలకు మొదటి ఈవీఎం ర్యాండమైజేషన్‌లో కేటాయించిన పోలింగ్ యంత్రాలు..

| అసెంబ్లీ | బ్యాలెట్ యూనిట్లు | కంట్రోల్ యూనిట్లు | వీవీప్యాట్లు |
|---|---|---|---|
| ఖమ్మం | 440 | 440 | 497 |
| పాలేరు | 359 | 359 | 406 |
| వైరా | 312 | 312 | 352 |
| మధిర | 332 | 332 | 375 |
| సత్తుపల్లి | 364 | 364 | 411 |

### స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంలు

అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలను తరలిస్తున్నట్లు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి వైరాలోని బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల, మధిర సెగ్మెంట్‌కు సంబంధించి మధిరలోని పాలిటెక్నిక్ కళాశాలలో, సత్తుపల్లి సెగ్మెంట్ కు సంబంధించి, సత్తుపల్లిలోని జ్యోతి నిలయం హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు.

## పార్టీ నిర్ణయం ప్రకారం
# లోక్‌సభ ఎన్నికల్లో పనిచేయాలి

**టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం**


మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 21: లోకసభ ఎన్నికల్లో కూడా పార్టీ అధిష్ఠానం నిర్ణయం ప్రకారం శ్రేణులు నడుచుకోవాలని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో ఆదివారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోకసభ ఎన్నికల్లోనూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం ప్రకారం శ్రేణులు నడుచుకోవాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. రాష్ట్ర పార్టీ నాయకత్వం ఇచ్చే ఆదేశాల మేరకు ఈ ఎన్నికల్లో శ్రేణులు నడుచుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా నాయకులు, పార్టీ శ్రేణులు వ్యవహరించవద్దని కోరారు. ఏపీలో జనసేన, బీజేపీతో కూటమితో తెలుగుదేశం పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ తరువాత చంద్రబాబునాయుడు సుపరిపాలనతో సంక్షేమ పథకాలు అందించిన టీడీపీని తెలుగు రాష్ట్రాల ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, చుండూరు రాజేశ్వరి, వాసిరెడ్డి భాస్కర్‌రావు, మేడిపల్లి రాణి, కట్రం స్వామి, టీవీ రాఘవులు, సానబోయిన శ్రీనివాస్ గౌడ్, పసలం వెంకటేశ్వర్లు, పోటు సరస్వతి, మందపల్లి రజిని, ఆర్ఎం రామయ్య, తాళ్లూరి అప్పారావు, నల్లమాస మల్లయ్య, మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.





# గెలుపు ధీమా

» కాంగ్రెస్ శ్రేణుల్లో పెరిగిన విశ్వాసం
» మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
» అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పై 2,41,987 మెజారిటీ
» ఎంపీ విజయం కోసం కాంగ్రెస్ వ్యూహాలు

ఇల్లెందు, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కాంగ్రెస్ నేతల్లో గెలుపు ధీమా వ్యక్తమవుతోంది. మూడునెలల క్రితం జరిగిన శాసన సభ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని 7శాసనసభ నియోజకవర్గాల్లో 6 స్థానాల్లో కాంగ్రెస్,1 స్థానంలో బీఆర్ఎస్ విజయం సాధించిన అసెంబ్లీ సెగ్మెంట్లలో సమీప బీఆర్ఎస్ అభ్యర్థులపై కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీలతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్‌కు 6,85,897 ఓట్లు లభించగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు లభించాయి. లోక్‌సభ నియోజకవర్గంలోని ఇల్లెందు, పినపాక, మహబూబాబాద్, నర్సంపేట, డోర్నకల్, ములుగు స్థానాల్లో కాగ్రెస్ గెలుపొందగా, భద్రాచలంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. అయితే ఎన్నికల పిదప భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సైతం కాంగ్రెస్‌కు సన్నిహితంగా మారడంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భద్రాచలంలో సైతం తమకు ఆధిక్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

**కాంగ్రెస్‌కు 6 సెగ్మెంట్లలో ఆధిక్యం**

అసెంబ్లీ ఎన్నికల్లో మహబుబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఇల్లెందు అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు 57,309 ఓట్లు,డోర్నకల్ సెగ్మెంట్‌లో జాటోత్ రాంచంద్ర నాయక్‌కు 53,131 ఓట్లు,మహబుబాబాద్ సెగ్మెంట్‌లో దొంతు మాధవరెడ్డికి 18,889 ఓట్లు,ములుగు సీతక్కకు 33,700 ఓట్లు,పినపాకలో పాయం వెంకటేశ్వర్లుకు 34,506 ఓట్ల ఆధిక్యం లభించాయి. కాగా భద్రాచలంలో బీఆర్ఎస్‌కు చెందిన తెల్లం వెంకట్రావుకు 5719 ఓట్ల మెజారిటీ లభించింది. మొత్తం మీద మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌పై 2,41,987 ఓట్లు అధికంగా లభించాయి. ఈ పరిణామాలతో పాటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 5 గ్యారంటీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంట గ్యాస్,ఆరోగ్య రక్ష, గృహ నిర్మాణం, రైతు భరోసా పథకాలతో మరింతగా ఓటింగ్ పెరుగుతుందని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంతో మహబుబాబాద్ లోక్ సభ నియోజకవర్గంలోని అన్ని సెగ్మెంట్లలో భారీ ఆధిక్యాలు లభిస్తాయన్న ఆశాభావాన్ని కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

**మూడు పర్యాయాల విజేతలే ప్రత్యర్థులుగా...**

మహబుబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడ్డాక ఇప్పటి వరకు మూడు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. నాలుగో పర్యాయం జరుగుతున్న తాజా ఎన్నికల్లో గతంలో మూడు పర్యాయాలు జరాగిన ఎన్నికల్లో గెలుపొందిన వారే నేడు ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. 2009 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పోరిక బలరాం నాయక్ సమీప ప్రత్యర్థి సిపిఐ కి చెందిన కుంజ శ్రీనివాస్‌రావుపై 68,957 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ తన ప్రత్యర్థి కాగ్రెస్‌కు చెందిన పోరిక బలరాం నాయక్‌పై 34,992 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. 2019 లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎంపీగా ఉన్న సీతారాం నాయక్ కు టికెట్ ఇవ్వకుండా మాలోత్ కవితను ఎన్నికల బరిలో దింపింది. టీఆర్ఎస్‌కు చెందిన కవితకు 1,46,663 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన బలరాంనాయక్‌పై విజయం సాధించారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల్లో గతంలో గెలుపొందిన ఎంపీలే ప్రధాన అభ్యర్థులుగా తలపడుతుండటం గమనార్హం.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో గొల్లపూడి

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 21: ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాపార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మాజీ అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు ను కలిసి వారి ఆశీ స్సులు తీసుకున్నారు. తనకు ఎన్నిక ల్లో సహకరించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల మద్దతుతో ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో పోటీ చేస్తున్నానని అన్నారు. ప్రశ్నించే గొంతుకునై ముందుకు వెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తోటకూరి శ్రీనివాసరావు, పి.దీపిక పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రామారావు


# డబుల్ దమాకా..!

పార్లమెంట్‌లో 'జలగం' బలగం
చరిత్ర సృష్టించిన సోదరులు
రెండేసి పర్యాయాలు ఎన్నికైన వెంగళరావు, కొండలరావు

సత్తుపల్లి, ఏప్రిల్ 21: సత్తుపల్లి కేంద్రంగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి దశాబ్దాల పాటు ఖమ్మం జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న జలగం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలుపొందారు. సత్తుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా, కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రిగా పనిచేశారు. ఆయన సోదరుడు జలగం కొండలరావు కూడా ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికయ్యారు. వెంగళరావు పెద్దకుమారుడు జలగం ప్రసాదరావు సత్తుపల్లి నుంచి ఎమ్మెల్యేగా రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. చిన్న కుమారుడు జలగం వెంకటరావుకూడా సత్తుపల్లి, కొత్తగూడెం శాసన సభ్యుడిగా పనిచేశారు. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి జలగం వెంగళరావు రెండు పర్యాయాలు, జలగం కొండలరావు రెండు పర్యాయాలు ఎంపీలుగా గెలుపొందారు.

**ఎంపీలుగా జలగం సోదరులు**

ఖమ్మం లోక్‌సభ స్థానానికి 1977లో జరిగిన ఎన్నికల్లో జలగం కొండలరావు సీపీఎం అభ్యర్థి యలమంచిలి రాధాకృష్ణమూర్తిపై పోటీ చేసి గెలుపొందారు. అప్పటి ఎన్నికల్లో కొండలరావుకు 2,08,617ఓట్లు రాగా రాధాకృష్ణమూర్తికి 1,22,628 ఓట్లు వచ్చాయి.





కొండలరావు

ఇదే స్థానం నుంచి 1980లో జలగం కొండలరావు కొండలరావు సామినేని ఉపేంద్రయ్య (కాంగ్రెస్ యూ)పై పోటీ చేసి గెలుపొందారు. జలగం కొండలరావుకు 2,01,559 ఓట్లు రాగా సామినేని ఉపేంద్రయ్యకి 1,06,076 ఓట్లు వచ్చాయి.

1984లో ఖమ్మం స్థానంలో సీపీఐ అభ్యర్థి నల్లమల ప్రసాదరావుపై జలగం వెంగళరావు పోటీ చేసి గెలుపొందారు. జలగం వెంగళరావుకు 2,61,056ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి నల్లమల ప్రసాద్‌కు 1,69,557 ఓట్లు వచ్చాయి.

1989 ఖమ్మం లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో వెంగళరావు, సీపీఎం అభ్యర్థి యలమంచిలి రాధాకృష్ణమూర్తిపై గెలుపొందారు. వెంగళరావుకు 3,88,461 ఓట్లు రాగా యలమంచిలి రాధాకృష్ణమూర్తికి 3,29, 209 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నాలుగు పర్యాయాలు జలగం సోదరులు ఖమ్మం ఎంపీగా గెలుపొందారు.

# పార్లమెంట్‌లో.. పది రూపాయల డాక్టర్

భద్రాచలం లోక్‌సభస్థానం నుంచి ఎన్నికైన ఏకైక వైద్యుడు మిడియం బాబూరావు. సీపీఎం నుంచి తొలిసారిగా భద్రాచలం లోక్‌సభ సెగ్మెంట్‌లో పోటీ చేసి విజయం సాధించారు. వైద్య వృత్తి చేస్తూనే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు, పార్టీ చేపట్టే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వైద్యుడిగా కేవలం రూ.10 మాత్రమే ఫీజుగా తీసుకొని నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలకు వైద్యం అందించారు.

» గత భద్రాద్రి లోక్‌సభ సెగ్మెంట్‌లో ఆదివాసీ వైద్యుడు
» అటవీహక్కుల చట్టం బిల్లు చర్చలో భాగస్వామి
» చరిత్ర సృష్టించిన మిడియం బాబూరావు

భద్రాచలం, ఏప్రిల్ 21: 1967లో భద్రాచలం లోక్‌సభ నియోజక వర్గం ఆవిర్భవించగా 2004 వరకు 11 సార్లు జరిగిన ఎన్నికల్లో గెలిచిన వారిలో బాబూరావు ఒక్కరే వైద్యుడు కావడం విశేషం. ఎంబీబీఎస్ చదివిన ఆయన భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబెల్లి గ్రామానికి చెందిన వారు. వైద్యవిద్యను అభ్యసించేందుకు ఎన్నో కష్టాలు పడ్డారు. తొలి నుంచి సీపీఎం సానుభూతిపరుడిగా, నాయకుడిగా పని చేసిన ఆయన రాజమండ్రి మునిసిపాలిటీకి కౌన్సిలర్‌గా సైతం ఎన్నికై గతంలో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పార్టీ తనకు భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడంతో ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారు.



మిడియం బాబూరావు

**జేపీసీ సభ్యుడిగా...**


2004లో భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం తరపున పోటీ చేసిన డాక్టర్ మిడియం బాబూరావు సౌమ్యుడుగా పేరొందారు. ఈ పోటీలో ఆయన విజయం సాధించారు. 2004-09 మధ్య కాలంలో పార్లమెంటులో చర్చకు వచ్చిన చారిత్రాత్మకమైన గిరిజన అటవీహక్కుల చట్టం బిల్లు చర్చలో పాల్గొని తనదైన శైలిలో వాణిని వినిపించారు. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా ఉండి అనేక ప్రతిపాదనలను చట్టంలో చేర్చడంలో ఆయన కృషి అమోఘం. ఇదిలా ఉండగా 2018 వరకు ఆయన ఏపీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2018లో భద్రాచలం అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ ఆయన్ను అక్కడ నుంచి రిలీవ్ చేయగా భద్రాద్రి అసెంబ్లీ బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. అనంతరం మిడియం బాబురావు 2022 జనవరి నుంచి తెలంగాణ రాష్ట్ర సీపీఎం కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఏఆర్ఎం) జాతీయ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# లక్ష్మీపురం టు ఢిల్లీ..!

» లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన మల్లు బ్రదర్స్
» డిప్యూటీ సీఎం భట్టికి స్వయానా సోదరులు
» వారి వారసత్వంతోనే విక్రమార్క రాజకీయాల్లోకి...

'ఖమ్మంజిల్లా వైరా మండలంలోని కుగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లు సోదరులు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఎలాంటి రాజకీయ అండదండలు లేని పేద దళిత కుటుంబానికి చెందిన మల్లు సోదరులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత సోదరులిద్దరూ ఎంపీలుగా పనిచేశారు. భట్టి అన్నలైన మల్లు అనంతరాములు, డాక్టర్ మల్లు రవి రెండేసిసార్లు లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. మల్లు అనంతరాములు రాజకీయ వారసత్వంతోనే భట్టి విక్రమార్క రాజకీయ రంగ ప్రవేశం చేసి డిప్యూటీ సీఎం స్థాయిలో కొనసాగుతున్నారు.'

వైరా, ఏప్రిల్ 21: ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసే మల్లు అనంతరాములు రాజకీయాలపై మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1978లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రోత్సాహంతో అనంతరాములు కాంగ్రెస్ రాజకీయాల్లో రాణించారు. చెన్నారెడ్డి ప్రోత్సాహంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు అనంతరాములు పోటీచేసి ఏడో లోక్‌సభకు తొలిసారి ఎన్నికయ్యారు. 1984వరకు ఆయన ఎంపీగా పనిచేశారు. ఆసమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు గురికావడం, రాజీవ్‌గాంధీ ప్రధాని కావడం ఆవెంటనే మళ్లీ 8వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. 1984లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీచేసిన అనంతరాములు ఓడిపోయారు. అయినప్పటికీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ముఖ్యఅనుచరుడిగా కొనసాగారు. అఖిలభారత వ్యవసాయ క్షేత్రాల చైర్మన్‌గా పనిచేశారు. జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. తిరిగి 1989లో 9వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి అనంతరాములు పోటీచేసి విజయం సాధించారు. ఆసమయంలోనే రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో అప్పటివరకు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఆవెంటనే అనంతరాములును పీసీసీ అధ్యక్షుడిగా రాజీవ్‌గాంధీ నియమించారు. ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న అనంతరాములు 1990 ఫిబ్రవరి ఏడున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు.



అనంతరాములు



మల్లు రవి

●అనంతరాములు హఠాన్మరణంతో ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ మల్లు రవి ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అనంతరాములు వారసుడిగా 1991లో 10వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవి పోటీ చేసి విజయం సాధించారు. పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్న ఐదేళ్ల ఆయన ఎంపీగా కొనసాగారు. తిరిగి 1996లో 11వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి రెండోసారి పోటీచేసిన డాక్టర్ మల్లు రవి ఓటమిపాలయ్యారు. ఆతర్వాత 1998లో 12వ లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీచేసిన రవి విజయం సాధించారు. 1999లో 13వ లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే డాక్టర్ రవిని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. ఆతర్వాత 2008లో జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో డాక్టర్ రవి పోటీచేసి విజయం సాధించారు. 2009లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఇప్పుడు 18వ లోక్‌సభకు జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ రవి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మొత్తంగా వైరా ప్రాంతంలోని ఓ కుగ్రామానికి చెందిన మల్లు సోదరులు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీచేసే అదృష్టం దక్కింది.

# నాయిక.. ఏలిక..!

» ఇద్దరు మహిళా ఎంపీల హ్యాట్రిక్ విక్టరీ
» ఖమ్మం ఖ్యాతిని పెంచిన లక్ష్మీకాంతమ్మ
» భద్రాచలం నుంచి గెలిచిన రాధాబాయి
» కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వనితలు

ఖమ్మం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ రాజకీయాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు సువర్ణాక్షరాలతో లిఖితమయ్యాయి. ఇద్దరు కాంగ్రెస్ మహిళ ఎంపీలు హ్యాట్రిక్ ఎంపీలుగా చరిత్ర సృష్టించారు. అందులో ఖమ్మం ఎంపీగా తేళ్ల లక్ష్మీకాంతమ్మ కాగా, భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి రాధాబాయి ఆనందరావు... ఇద్దరు వరుసగా మూడు సార్లు గెలిచి రికార్డు సృష్టించారు.

**ఇందిరాగాంధీ మెచ్చిన లక్ష్మీకాంతమ్మ**

ఖమ్మం లోక్‌సభకు తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1962, 1967, 1971లో ఖమ్మం ఎంపీగా గెలిచి కాంగ్రెస్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించారు. ఇందిరా గాంధీ దృష్టిలో పడిన ఆమె జాతీయ రాజకీయాల్లో రాణించారు. పీవీ నర్సింహారావుకు సలహాదారుగా కూడా లక్ష్మీకాంతమ్మ వ్యవహరించారు. మహబూబ్ నగర్ జిల్లా అలంపూర్‌కు చెందిన లక్ష్మీకాంతమ్మ 1924 జులై 16న జన్మించారు. ఆర్థికశాస్త్రంలో ఎంఏ చదివిన ఆమె ఉన్నత విద్యావంతురాలు కావడంతో 1957లో ఖమ్మం అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీ ఆమెను ఎమ్మెల్యేగా బరిలోకి దిగి కమ్యూనిస్టులను ఎదిరించి పోరాడారు. భూస్వామ్య రైతు కుటుంబం నుంచి వచ్చిన లక్ష్మీకాంతమ్మ పలు భాషలు , రచనల్లోను ప్రావీణ్యత పొందారు. ఆమె భర్త తేళ్ల వెంకట సుబ్బారావు అటవీశాఖ అధికారిగా పనిచేశారు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు ఆమె పార్లమెంటరి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. 1975లో ఎమర్జెన్సీ తరుణంలో ఆమె వ్యతిరేకించి జనతాపార్టీలో చేరారు. 1977లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి జనత పార్టీ నుంచి పోటీచేసి ఓటమి చెందారు. ఆమె 2007 డిసెంబరు 13న విజయవాడలో మృతి చెందారు. ఆమె కుమార్తె రాజకీయానికి దూరంగా వ్యాపారంలో విజయవాడలో స్థిరపడ్డారు.



**నాలుగు సార్లు గెలిచిన రాధాబాయి**

1967లో ఏర్పడిన భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగిన బి.రాధాబాయి ఆనందరావు 1967, 1971,1977, 1980 వరుసగా నాలుసార్లు గెలిచారు. 1984లో టీడీపీ వామపక్షాల కూటమి అభ్యర్థి సోడే రామయ్య చేతిలో ఓడిపోయారు. ఆతర్వాత ఆమె రాజకీయాలకు దూరమయ్యారు. స్వాతంత్ర సమరయోధురాలిగా, ఉన్నత విద్యావంతురాలిగా గుర్తింపు పొందిన పార్లమెంటేరియన్ రాధాబాయి ఆనందరావు, 1930 ఫిబ్రవరి 2న పూర్వపు ఖమ్మం జిల్లా వెంకటాపురంలో జన్మించారు. ఆమె 1977లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సందర్భంలో ఆమె సొంత సోదరి పి.వాణీ రమణారావు లోక్‌దళ్ నుంచి ప్రత్యర్థిగా నిలిచారు. ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. కొత్తగూడెం సింగరేణి కాలరీస్‌లో కుటుంబ నియంత్రణ కార్యకర్తగా కొంతకాలం పనిచేశారు. కొత్తగూడెం సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ రామవరం పేరెంట్స్ కమిటీలో పనిచేశారు. రామవరం పంచాయతీసమితి సభ్యురాలిగా వ్యవహరించారు. 1991ఏప్రిల్ 17న కన్నుమూశారు.



## ఎన్టీఆర్ స్ఫూర్తితో
# మరిన్ని అభివృద్ధి పనులు

» బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా
» ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ప్రచారం
» కారేపల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం కార్పొరేషన్/కారేపల్లి, ఏప్రిల్21: ఎన్టీఆర్ స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి పనులకు బాటలు వేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నామా ఆదివారం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లి వాకర్స్‌ను కలిశారు. తొలుత ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్‌పార్కు వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపించినందుకు తెలంగాణా గొంతుకను పార్లమెంట్‌లో వినిపించానన్నారు. పార్లమెంట్ సమావేశాలకు అత్యధికంగా హాజరయ్యానని, సమస్యలను ప్రస్తావించటం ద్వారా రికార్డు సృష్టించానని అన్నారు. తద్వారా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొంది, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపచేశానని నామా పేర్కొన్నారు. రెండు పర్యాయాలు ఎన్నికల్లో తనకు వాకర్స్ ఎంతో సహకరించారని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జశ్వంత్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, వాకర్స్‌క్లబ్ కార్యదర్శి ఖాదర్‌బాబు, కోశాధికారి గడిపూడి జనార్దన్‌రావు, గుత్తా శ్రీనివాసరావు, తాళ్లూరి హరీష్, చీకటి రాంబాబు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎంపీ నామా

**బీఆర్ఎస్ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలి**

కారేపల్లి: రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు ఖమ్మంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కార్యకర్తలను కోరారు. కారేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంకు జడ్పీటీసీ సభ్యులు జగన్ అధ్యక్షతన జరిగింది. నామా మాట్లాడుతూ ఇప్పుడు అందరుకలిసి కష్టపడి గెలిపించండి ఐదేళ్లు మీకు అండగా ఉంటానన్నారు. ప్రజల్లోకి వెళ్ళి కాంగ్రెస్ మోసాన్ని వివరించి,చైతన్య పర్చాలన్నారు. మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ నామాను భారీ మెజార్టీతో గెలిపించుకోవడంద్వార పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు మాట్లాడుతూ నామాను గెలిపించుకోవడంద్వార పార్టీని కాపాడాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్, మండలపార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట

» మార్నింగ్ వాక్‌లో ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 21: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మార్నింగ్ వాక్‌లో భాగంగా వాకర్స్, క్రీడాకారులతో మాట్లాడారు. తనకు చిన్న తనంలోనే అన్ని ప్రధాన ఆటల్లో ప్రవేశం ఉందన్నారు. గోల్ఫ్‌లో జాతీయస్థాయిలో అనేక టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపినట్టు తెలిపారు. క్రీడలకు బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేయనుందని, తాను గెలిచిన తర్వాత కోచ్‌లకు ప్రోత్సాహం ఇస్తానని హామీ ఇచ్చారు. ఆటగాళ్ల జీవితాలలో కోచ్‌ల పాత్ర ఎంతో ఉందని, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. పలువురు వాకర్లు మోదీపట్ల ఉన్న అభిమానం తెలియచేశారని, అది చాలా సంతోషం కలిగించిందన్నారు. అనంతరం వినోదరావు ఆర్చరీ, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్టుల్లె క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు ఆటలాడి సందడి చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, తాజునూత్ భద్రం, శ్రీనివాస్, బిక్షపతి, కిరణ్, ప్రతాప్, సురేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న తాండ్ర

# ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

» ఓటర్లకు అవగాహన కార్యక్రమంలో సత్తుపల్లి, వైరా మునిసిపల్ కమిషనర్లు మదా రవిబాబు, వేణు, ఏఆర్‌వో రాజేశ్వరీ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతీ ఒక్కరూ ఓటువేసి తమకు నచ్చిన నాయకత్వాన్ని ఎన్నుకోవాని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. ఆదివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని డాక్టర్స్ రెసిడెన్సీ వద్ద నిర్వహించారు. ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. మతం, జాతి, కులం, వర్గం, భాష, ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో ఓటు వేయాలని తెలిపారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన ప్రాంతాలపై దృష్టి సా రించామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వైరా: ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని వైరా మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు కోరారు. ఆదివారం వైరా మునిసిపాలిటీలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ వేణు ఆధ్వర్యంలో మునిసిపల్ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపాలిటీలో నూరుశాతం మంది ఓటుహక్కు వినియోగించుకొనేవిధంగా ప్రతి వార్డులోని, వీధుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని, వైరా ఆరోవార్డులోని ఓ అపార్టుమెంట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



సత్తుపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న కమిషనర్

**ఎన్నికల నిబంధనలు అతిక్రమించవద్దు: ఏఆర్‌వో**

ఖమ్మంరూరల్: ఎన్నికలప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు లోబడే నడుచుకోవాలని నిబంధనలు అతిక్రమించవద్దని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి తెలిపారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులు నిరంతరం గ్రామాల్లో నిఘా ఉంచుతామన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల కమిషన్ మొబైల్ యాప్ ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం బీఎల్‌ఓలతో సమా వేశం నిర్వహించారు. వృద్దులు, దివ్యాంగులు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏఆర్‌వో రాజేశ్వరీ బీఎల్‌ఓలకు సూచించారు. ఏఆర్ఓ మాట్లాడుతూ నడవలేని వారు పూర్తిగా మంచానికే పరిమితమైన వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓ టు హక్కు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.

# ఆకుపచ్చగా భగీరథ నీరు

- వైరాలో రంగు మారిన తాగునీటి సరఫరా
- తాగలేక అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపాలని వినతి

వైరా, ఏప్రిల్ 21: వైరా రిజర్వాయర్‌లోని రంగుమారిన నీటినే మిషన్ భగీరథ పథకం నుంచి 12మండలాలకు తాగునీటిగా సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్ నీటి మట్టం తగ్గిపోవడంతో తీవ్రమైన ఎండలకు రిజర్వాయర్‌లో ఉన్న నీరు ఆకుపచ్చ రంగులోకి మారింది. మిషన్ భగీరథ పథకంలో రంగుమారిన నీటినే నల్లాల ద్వారా సరఫరా చేస్తున్నారు. దాంతో రంగుమారిన నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. వైరా రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా 12మండలాల్లోని దాదాపు 465గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్‌లోని రావాటర్‌ను మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్ నుంచి కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని ముక్రీహిల్స్ ద్వారా ఫిల్టర్‌బెడ్స్‌కు అలాగే మరో పైపులైన్ ద్వారా కల్లూరు మండలంలోని కనకగిరి గుట్టలపైనున్న ఫిల్టర్‌బెడ్స్‌కు సరఫరా చేసి అక్కడ శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటిని గ్రామాలకు నిత్యం సరఫరా చేస్తున్నారు. అయితే గత వారం రోజులుగా వైరా రిజర్వాయర్ నుంచి ముక్రీహిల్స్, కనకగిరి ఫిల్టర్‌బెడ్స్‌కు సరఫరా అయిన రావాటర్ శుద్ధి కావడం లేదు. రిజర్వాయర్‌లో ఉన్న విధంగానే ఆకుపచ్చ రంగులో ఉన్న నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతుంది. ఈ నీరు వాసన కూడా వస్తుండటంతో తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. రిజర్వాయర్ నీటిమట్టం 8.9అడుగులకు పడిపోయింది. దానివలన రిజర్వాయర్‌లో ఉన్న నీరు ఎండలకు ఆకుపచ్చ రంగులోకి మారింది. మిషన్ భగీరథ అధికారులు ఈ నీటిలో క్లోరినేషన్ చేస్తున్నప్పటికీ ఆకుపచ్చ రంగులో ఉన్న నీరు నల్లాల ద్వారా ప్రజలకు చేరుతుంది. అందువలన ఈ నీటిని తాగేందుకు ప్రజలు భయాందోళనలకు లోనవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టాన్ని పెంచాల్సి ఉంది. అందువలన సాగర్‌జలాలను వైరా రిజర్వాయర్‌కు విడుదల చేసి రంగుమారిన కలుషిత నీరు స్థానంలో స్వచ్ఛమైన నీటిని ప్రజలకు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. వాస్తవంగా మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్‌లో 14అడుగుల నీటి లభ్యత ఉండేలా గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో తాగునీటి అవసరాల కోసం సాగర్‌జలాలతో రిజర్వాయర్‌ను నింపే ప్రక్రియ ప్రభుత్వమే చేపడుతుందని స్పష్టం చేసింది. అయితే గత ప్రభుత్వం గానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ తాగునీటి అవసరాల కోసం వైరాకు సాగర్‌జలాలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చూపాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో ఉన్న నీటిని మిషన్ భగీరథ నుంచి తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఎండల తీవ్రతతో రంగు మారి కలుషితమైన నీటిని సరఫరా చేస్తుండటంతో లక్షలాదిమంది ప్రజలు అనారోగ్యం బారీన పడే ప్రమాదముంది. అందువలన వెంటనే సాగర్‌జలాలు విడుదల చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



నీటిమట్టం తగ్గిపోయిన వైరా రిజర్వాయర్



ఇళ్లకు సరఫరా అయ్యే రంగుమారిన నీరు

## క్రమశిక్షణ, ఆత్మస్థైర్యంతో లక్ష్య సాధన సులభం

- సివిల్స్ ర్యాంకర్ సాయి అలేఖ్య



సాయి అలేఖ్యను సన్మానిస్తున్న గ్రామస్థులు

బోనకల్, ఏప్రిల్ 21: క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం అనుకున్న లక్ష్యాల సాధనలో పాటించాల్సిన సులభ మార్గాలని సివిల్స్ ర్యాంకర్ సాయి అలేఖ్య అన్నారు. ఆదివారం సివిల్స్ ర్యాంకు వచ్చిన తరువాత తొలిసారిగా తన సొంత గ్రామం గోవిందాపురం(ఎల్)కు రాగా ఆమెకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆమె సన్మాన కార్యక్రమంలో ఆంధ్రా డీజీజీ చౌటూరి వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదలతో సివిల్స్ ర్యాంకు సాధించి నేటి యువతకు సాయి అలేఖ్య ఆదర్శంగా నిలిచిందన్నారు. తమ తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల ప్రోత్సాహం తన లక్ష్య సాధనలో దోహద పడిందని ఆమె తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవడంతో పాటు ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పంతో లక్ష్యాలను చేరుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మేడేపల్లి విద్యార్థి ఎంపిక



కావ్య

ముదిగొండ, ఏప్రిల్ 21: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మండలంలోని మేడేపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కావ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో అండర్-16బాలికల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి, ఈనెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపా రు. కావ్య గతంలో ఫుట్‌బాల్ విభాగంలో రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల విభాగంలో పాల్గొన్నదని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన కావ్యను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, పీఈటీ కృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## భద్రాద్రిలో సంగీత స్వరార్చన



సంగీత స్వరార్చన పోటీల్లో పాల్గొన్న కళాకారులు

భద్రాచలం, ఏప్రిల్ 21: భద్రాచలంలో ట్రూటాలెంట్స్, భద్రాద్రి మెలోడీ ఆధ్వర్యంలో సంగీత స్వరార్చన పోటీలను ఆదివారం భద్రాచలం అహోబిల మఠంలో నిర్వహించారు. మొదటి రెండు రౌండ్‌లలో పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించగా, నలుగురు తుది రౌండ్‌కు నలుగురు ఎంపికయ్యారు. వీరు ఆదివారం భద్రాచలంలో కర్ణాటక సంగీతంలో ఫైనల్ రౌండ్ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో విజేతలకు నగదు పారితోషికాలు అందజేశారు. ప్రథమస్థానం సాధించిన వారికి రూ.5 వేలు, రన్నర్స్‌గా నిలిచిన వారికి రూ.3 వేలు, తృతీయ, చతుర్థి స్థానాల్లో నిలిచిన వారికి రూ.1,500 చొప్పున బహుమతి ప్రదానం అహోబిలం మఠం నిర్వాహకులు డా. కృష్ణ చైతన్య, దుర్గా కోమలి అందజేశారు.

## గుండెపోటుతో లారీడ్రైవర్ మృతి

కల్లూరు, ఏప్రిల్ 21: గుండె పోటుతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు చౌదరి హోటల్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాలోని కిషన్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ ఎండీ.ఖలీల్(65) అనకాపల్లి నుంచి సిద్దిపేటకు వెళ్తుండగా భోజనం చేసేందుకు స్థానికంగా చౌదరి హోటల్ వద్ద మధ్యాహ్నం సమయంలో లారీని ఆపాడు. భోజనం చేసిన తర్వాత లారీలోకి ఎక్కుతుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## చెట్టుపై నుంచి జారిపడి కేటీపీఎస్ కార్మికుడు..

పాల్వంచ, ఏప్రిల్ 21: చెట్టుపై నుంచి జారిపడి కేటీపీఎస్ కార్మికుడు మృతి చెందిన సంఘటన పాల్వంచలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జెన్కో కాలనీగెస్ట్‌హౌస్‌లో ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న మహమద్ గౌస్ (41) ప్రతి రోజు మాదిరిగా డ్యూటీ పూర్తి చేసుకుని రిలీవర్ మసూద్‌కు ఫోన్ చేసి గెస్ట్ హౌస్ వెనుక భాగంలో మూత్ర విసర్జనకు వెళ్తున్నానని వాచ్‌మన్‌కు చెప్పి వెళ్లాడు. అతడు ఎంతకూ తిరిగి రాకపోవడంతో వాచ్‌మన్ అతడి కోసం వెతుకుతుండగా, ఈ క్రమంలో అక్కడ క్వార్టర్‌లో నివాసముంటున్న ఓ ఉద్యోగి ఎవరో మామిడి చెట్టు కింద పడి ఉన్నారని వారికి చెప్పాడు. తీవ్ర రక్తపుమడుగులో ఉన్న అతడిని స్థానిక వైద్యాధికారి పరిశీలించగా, గౌస్ మృతి చెందాడని నిర్ధారించారు. మామిడి కాయలు కోయడానికి చెట్టు పైకి ఎక్కి జారిపడి మృతి చెంది ఉంటాడని అందరూ భావిస్తున్నారు. మృతుడి భార్య తస్లీం సుల్తానా తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## నీటి సంపులో పడి యువకుడు..

- హైదరాబాద్‌లో ఘటన



సుఫియాన్ మృతదేహం

ఇల్లెందు టౌన్, ఏప్రిల్21: నీటి సంపులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలోని బస్తీ నెంబర్-2కు చెందిన అక్మల్ సుఫియాన్(24) కొంతకాలంగా హైదరాబాద్‌లోని కొండాపూర్ ఏరియాలో ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతి చెందాడని తెలిపారు. సుఫియన్ నీటి సంపులో పడిన ఘటన సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయ్యింది.

## అనుమానాస్పదంగా వ్యక్తి...

దమ్మపేట, ఏప్రిల్ 21: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన దమ్మపేట శివారులో గల నెమిలిపేట గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. అల్లిపల్లి గ్రామానికి చెందిన మృతుడి తల్లి కలిదిండి ప్రమీలరాణి పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం.. తన పెద్ద కుమారుడు మహేంద్రవర్మ( 35) ఆదివారం సాయంత్రం దమ్మపేట సమీపంలోని ఓ పామాయిల్ తోటలో పురుగుల మందు తాగి మృతి చెంది పడి ఉన్నాడని ఆమె రెండో కుమారుడు విజయరామరాజు తమకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలిపారు. తాము సంఘటనాస్థలానికి వెళ్లేటప్పటికీ మహేంద్రవర్మ మృతి చెంది ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా మాకు ఓ పొలం బేరానికి ఉన్నదని చూసి రావాటానికి వెళ్తున్నట్లు చెప్పినట్లు తెలిపారు. వర్మకు 13 ఏళ్ల క్రితం వివాహం అయ్యిందని, భార్యతో కలిసి కొంతకాలం ఆంధ్రరాష్ట్రం ఏలూరు జిల్లా భీమవరంలో ఉన్నారని పేర్కొన్నారు. కాగా ఇటీవల ఇరువురి మధ్య ఘర్షణలు చోటు చేసుకుండడంతో అక్కడి నుంచి వచ్చి తమ వద్ద ఉంటూ డైరీ పనులు చూసుకుంటున్నాడని తెలిపారు. ఈ క్రమంలో భూమి చూసి వస్తానని చెప్పి వెళ్లి చనిపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ దమ్మపేట పోలీసులకు ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలుడు

- లైన్‌మన్‌కు తీవ్రగాయాలు



గాయపడిన లైన్‌మన్ లింగాచారి

తల్లాడ, ఏప్రిల్ 21: తల్లాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం పేలుడు సంభవించి లైన్‌మన్ తీవ్రంగా గాయపడ్డాడు. సబ్‌స్టేషన్‌లోని యార్డులో ఎండల తీవ్రతకు ట్రాన్స్‌ఫా ర్మర్ పేలి సబ్‌స్టేషన్‌లో పనిచేసే లైన్‌మన్ పూసల లింగాచారి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని 108వాహనంలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లా రు. గాయపడిన లింగాచారిని డీఈ రాములు, ఏడీఈ ఖాదర్‌బాబు, ఏఈ రాజేష్ పరామర్శించారు.

## పాతనారంవారిగూడెంలో మద్యం పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 21: బెల్టు దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత నారంవారిగూడెం గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టు దుకాణంలో తనిఖీలు నిర్వహించగా, రూ.26,334 విలువైన మద్యం పట్టుబడింది. మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న సత్యనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా మాజీ పోలీస్ అధికారిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 21: మహిళను బెదిరించిన కేసులో జిల్లా మాజీ పోలీస్ అధికారితో పాటు ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళకు డబ్బుల విషయంలో బెదిరించిన కేసులో ఖమ్మం జిల్లా పోలీస్ అధికారితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. మహిళకు నగదు ఇచ్చిన వారికి మద్దతుగా సదరు అధికారి ఆమెను ఖమ్మం పిలిపించి బెదిరించిడంతో పాటు ఆమె బంగారు అభరణాలు లాక్కున్నట్లు, బాధితురాలు ఈ విషయమై ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కాగా కేసుకు సంబంధించిన వివరాలు చెప్పేందుకు ఫోన్‌చేయగా ఖానాపురంహవేలీ పోలీసులు స్పందించ లేదు. పోలీస్ అధికారులు కావాలని కేసుకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా వివరాలు మీడియాకు ఎవరికి చెప్పొద్దని అధికారులు ఆదేశించినట్లు కూడా ప్రచారం జరుగుతుంది.

## దేవాలయ ప్రతిష్ఠ విషయంలో ఇరు వర్గాల ఘర్షణ

- పలువురికి స్వల్ప గాయాలు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు

బోనకల్, ఏప్రిల్ 21: మండలంలోని మోటమర్రి గ్రామంలో ఆదివారం గౌడ కులస్థుల ఆరాధ్య దైవం కాటమయ్య దేవాలయ సాక్షిగా ఇరు వర్గాలు ఘర్షణలకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కొందరికీ స్వల్ప గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్లో పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు.

ఐదేళ్ల క్రితం గౌడ కులస్థులు కాటమయ్య గుడిని కట్టారు. విగ్రహాల ప్రతిష్ఠ మాత్రం చేయలేదు. నూతన విగ్రహాలను ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహిస్తున్నామని అందరూ పాల్గొనాలని గౌడ సంఘ అధ్యక్షుడు మందా కృష్ణయ్య చాటింపు చేయించాడు. గుడికి రంగులు, విగ్రహాల ప్రతిష్ఠకు సంబంధించి అన్ని పనులను చేపట్టారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ మందా చిన్నబ్బాయ్, అతని వర్గీయులు మమ్మల్ని పిలవకుండా ప్రతిష్ఠా కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తారని గుడి వద్దకు వెళ్లి పనులను ఆపే ప్రయత్నం చేయగా వివాదం నెలకొంది. గ్రామంలోని గౌడ కులస్థులు అక్కడకు చేరుకోవడంతో ఇరు వర్గాల నడుమ ఘర్షణ జరిగింది. ఇరు వర్గాల నడుమ జరిగిన తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై ఇరు వర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

# ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

- భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

దుమ్ముగూడెం ఏప్రిల్ 21: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో పలు విధ్వంసాలకు పాల్పడిన ఆరుగురు మావోయిస్టు మిలీషియా కమిటీ సభ్యులు ఆదివారం భద్రాచలం ఏఎస్పీ డా.పరితోష్ పంకజ్ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి డోకుపాడుకు చెందిన రవ్వ సన్న, మునికి సన్న, మడకం జోగా, కోవాసి మంగ, రవ్వ లక్క, కర్తం పొజ్జాలు ఉన్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం చర్ల ఏరియా కమిటీ, ఛత్తీస్‌గడ్ రాష్ట్రం కిష్టారం ఏరియా కమిటీ సాయుధ దళాలతో కలిసి పలు విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారు. అలాగే పోలీసులను హతమార్చేందుకు ఐఈడీ బాంబులను అమర్చిన ఘటనల్లో ఉన్నారు. పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా వీరంతా లొంగిపోయినట్లు ఏఎస్పీ తెలిపారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ ఏజెన్సీ అభివృద్ధికి మావోయిస్టులు అడ్డుపడుతున్నారని ఏఎస్పీ తెలిపారు. మావోయిస్టులు స్వయంగా పోలీసులకు లొంగిపోతే ప్రభుత్వం తరపున వారికి జీవనోపాధి, పునరావాసం కల్పిస్తామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు బొడ్డు అశోక్, రాజువర్మ, ఎస్ఐ గణేష్, 141 బీఎన్ కమాండెంట్ రితేష్ ఠాకూర్, సెకండ్ ఇన్ కమాండెంట్ కమల్‌వీర్ యాదవ్, ఏసీ రేవతి అర్జున్‌లు పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

## కారేపల్లి సంత తనిఖీ

కారేపల్లి, ఏప్రిల్21: కారేపల్లి మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి సంతను ఆదివారం డిప్యూటీ కమిషనర్ తన్నీరు శ్రీకాంత్‌రావు తనిఖీ చేశారు. సంత నిర్వహణలో లోపాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించారు. ఈసందర్భంగా డీసీ మాట్లాడుతూ సంతకు తరలించే మేకల వాహనాలను నాలుగింటిని తనిఖీ చేశామన్నారు.వీటికి సంబంధించి యాజమాన్యల దగ్గర ఉన్న మేకల రసీదులో ఉన్నవాటికి తేడా ఉందన్నారు. ఈవిషయంపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఈవో నర్సింహరావు, నల్లమోతు శేషయ్య, జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమత తదితరులున్నారు.



రసీదులను పరిశీలిస్తున్న అధికారులు

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు

# ప్రత్యేక టెట్ నిర్వహించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

బోనకల్/వైరా, ఏప్రిల్ 21: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని, ఉత్తీర్ణతా పరిమితిని 5 ఏళ్ల గడువును విధించి పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షు డు జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా మండలాల్లో నిర్వహిం చిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను పాఠశాల చివరి పనిదినం రోజున రిలీవ్ చేయాలని కోరారు. నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవు ల్లో పూర్తి చేయాలన్నారు. టెట్ ఉత్తీర్ణతా మార్కులను 35 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగ బలోపేతానికి తమ సంఘం పని చేస్తుందన్నారు. కుటుంబ సంక్షేమ నిధి ద్వారా ఇప్పటి వరకు మృతి చెంది న 20 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల సాయం అం దించామని తెలిపారు. ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు గానూ సామాజిక బాధ్యతతో కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఆదర్శప్రాయంగా ఉన్న వారు చిరకాలం గుర్తుంటారని, ఉపాధ్యాయుడు గంగసాని శ్రీనివాసరావు ఇందుకు నిదర్శనమని ఆయన సేవలను కొనియాడారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీనివాసరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ విధులు నిర్వర్తించిన ప్రతి బడిలోనూ మెరుగైన విద్య, క్రమశిక్షణ, విలువలను నేర్పి అందరి మన్ననలను పొందారని ప్రశంసించారు. సంఘ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ. 6 లక్షల సాయం శ్రీనివాసరావ కుటుంబ సభ్యులకు అందజేశారు. వైరా బాలికోన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుని సరస్వతి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో యూటీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు రంజాన్, సుధాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, హన్మంతరావు, సర్వర్‌బాబు, చల్లా కృష్ణారావు, చంద్రశేఖర్, యోహాన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, ఉద్దండు, రాజశేఖరరెడ్డి, వినోదరావు, వీరయ్య ఆంజనేయులు, మీరాఖాన్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

# ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కల్లూరు, ఏప్రిల్ 21: మండలంలోని పేరువంచ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1989-90 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆనాటి గురువులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పూర్వ విద్యార్థులకు టుంబ సమేతంగా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మౌలాలి, పూర్వవిద్యార్థులు సీతారామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కృష్ణ, అప్పలరాజు, జితేందర్‌రెడ్డి, రామారావు, జయప్రద, నిచ్చల, సుజాత, లక్ష్మీ, ప్రమీల, రాజు, బద్రీ, ప్రసాద్, రాందాస్ పాల్గొన్నారు.



కల్లూరులో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ముదిగొండ: ముదిగొండ మండలం వల్లభి జడ్పీఉన్నత పాఠశాలలో 1980-81పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 43ఏళ్ల తర్వాత ఒకేచోట కలిసి నవీరంతా ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పలువురు పూర్వవిద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవడం పట్ల తోటి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పెద్ది శేషగిరి, వెంకటేశ్వరరావు, వీరయ్య, బాబూరావు, శైలజా, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా నీటితొట్లు

- తాగునీటికి అల్లాడుతున్న పశువులు

తల్లాడ, ఏప్రిల్ 20: వేసవి కాలంలో ఎండల తీవ్రతకు పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లు నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నీటితొట్లు ఆనవాలు లేకుండాపోయాయి. పనికి ఆహార పథకం కింద రెండు దశాబ్దాల క్రితం వేసవిలో ఎండల తీవ్రతకు పశువుల దాహార్తి తీర్చేందుకు తల్లాడ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో నీటితొట్లు నిర్మించారు. చేతి పంపులు ఉన్న చోట్ల నీటి తొట్లను నిర్మించారు. వీటి నిర్వహణ గురించి పట్టించుకోక పోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో పూర్తిగా ధ్వంసమై ఆనవాలు లేకుండా పోయాయి. మరికొన్ని చోట్ల శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్నాయి. నీటి తొట్టి దగ్గర ఉన్న చేతినీటి పంపులు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. ప్రస్తుతం ఎండల తీవ్రతకు మండలంలోని కొన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు ఎండిపోవడంతో పొలాలకు మేతకు వెళ్లిన పశువులకు తాగేందుకు నీళ్లు దొరక్క అల్లాడుతున్నాయి. కనీసం నీటి తొట్లలో నీరుంటే పశువులు దాహార్తి తీర్చుకొనే అవకాశముండేది. నీటి తొట్ల నిర్వహణ లేకపోవడం, శిథిలమైపోవడంతో నీళ్లు లేక నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న నీటితొట్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రామానుజవరంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

## సత్యనారాయణపురంలో కలప పట్టివేత

ఇల్లెందురూరల్, ఏప్రిల్21: ఇల్లెందు మండలం సత్యనారాయణపురం చెరువు సమీపంలో అక్రమంగా దాచి ఉన్న టేకు కలపను ఆదివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్న ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ:1.50లక్షల టేకు కలపను స్వాధీనం చేసుకొని, కలప డిపోకు తరలించారు. కలప స్మగ్లర్లను త్వరలోనే పట్టుకుంటామని ఎఫ్‌డీవో వెంకన్న తెలిపారు.



పట్టుకున్న టేకు కలపను పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో వెంకన్న

## శివలింగాపురంలో చోరీ

- 32 తులాల బంగారం, 25 గ్రాముల వెండి అపహరణ

మణుగూరు, ఏప్రిల్ 21: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి వస్తువులను అపహరించారు. సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివలింగాపురం గ్రామానికి చెందిన పూనెం మానస, భర్త నవీన్‌లు గుట్టమల్లారం గ్రామంలో నివాసముంటున్నారు. కాగా మానస తండ్రి మృతి చెందగా, ఇంటికి తాళం వేసి కరివారిగూడెం వెళ్లారు. అంత్యక్రియల అనంతరం ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగిందని గమనించిన వారు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 32 తులాల బంగారం, కేజీ 25 గ్రాముల వెండి వస్తువులు చోరీ జరిగినట్లు ఈ ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. మణుగూరు సీఐ సతీస్ కుమార్ క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలాన్ని సిబ్బందితో పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అవయవ దానం



ఎలేంద్ర

మణుగూరు, ఏప్రిల్21: తాను మృతి చెందినా కూడా మరో నలుగురికి అవయవాలను దానం చేసింది ఆ మహిళ... మణుగూరు మునిసిపాలిటీ పికె1 సెంటర్ ఏరియాలో నివాసముండే మర్రికుక్కల ఎలేంద్ర(55) బ్రెయిన్‌డెడ్‌తో శనివారం రాత్రి మృతి చెందింది. తన భార్య మర ణం నలుగురికి ఆసరాగా మారాలని ఆమె భావించిన భర్త మర్రికుక్కల రాములు, అల్లుడు పొన్న కనకయ్య కుటుంబ సభ్యులు మృతురాలి అవయవాలను దానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అవయవాదానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

## ప్రశాంతంగా ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్ష

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 21: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటుగా మహబూబాబాద్ జిల్లాలో పరీక్షలు చేపట్టారు. మొత్తం 4,118 మంది విద్యార్థులు దరఖాస్తులు చేయగా వారిలో 3,702 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆర్సీవో ప్రత్యూష వెల్లడించారు.

## మెడికల్‌కార్డు రెన్యూవల్ చేసుకోవాలి

**సింగరేణి జీఎం జాన్‌ఆనంద్**

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 21 : సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు కలిగి ఉన్న మాజీ సింగరేణి ఉద్యోగులు, భార్యలు మెడికల్‌కార్డు రెన్యూవల్ చేయించుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడిల్‌కార్డు రెన్యూవల్ కోసం ప్రతి సంవత్సరం నవంబరు నెలలో లైఫ్‌సర్టిఫికెట్ సమర్పించడం జరుగుతుందని కానీ దాదాపు 282మంది మాజీ ఉద్యోగులు, వారి భార్యలు గత నవంబరు నెల నుంచి ఇప్పటి వరకు మెడికల్‌కార్డు రెన్యూవల్ కొరకు లైఫ్‌సర్టిఫికెట్ సమర్పించలేదని వివరించారు. దీని వల్ల వారి మెడికల్‌కార్డు సేవలు నిలిపివేయబడ్డాయని తెలిపారు. లైఫ్‌సర్టిఫికెట్‌ను సమర్పించి మెడికల్‌కార్డు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు.

# పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం

- నేలకూలిన చెట్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు
- తడిసిన మొక్కజొన్న.. రైతుల్లో ఆందోళన
- మణుగూరు డివిజన్‌లో పెనుగాలుల బీభత్సం
- చల్లబడిన వాతావరణం.. ఊపిరి పీల్చుకున్న ప్రజలు

జూలూరుపాడు, ఏప్రిల్ 21: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సాయంత్రం వాతావరణం మేఘావృతమై గాలి దుమారంతో పాటు వర్షం బీభత్సం సృష్టించింది. పడమట నర్సాపురం, బేతాళపాడు, మాచినేనిపేట తండా, కొమ్ముగూడెం తదితర గ్రామాలలో వడగండ్ల వర్షం కురిసింది. జూలూరుపాడు, వెంగన్నపాలెం, రామచంద్రపురం, గుండెపుడి తదితర గ్రామాలలో వర్షం పడింది. మాచినేనిపేట తండా, పడమట నర్సాపురం గ్రామాలలో గాలి బీభత్సనికి విద్యుత్ స్తంబాలు, చెట్లు విరిగిపడ్డాయి. పలు గ్రామాలలో రైతులు మొక్కజొన్నను కల్లాలలో ఆరబోశారు. అకాల వర్షంతో కొన్ని గ్రామాలలో మొక్కజొన్న తడిసిపోయింది. వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాలలో మొక్కజొన్న పంటను కాపాడుకొనేందుకు రైతులు పరుగులు తీసారు. పరదాలు కప్పారు. వర్షంతో రైతులు ఆందోళన చెందారు. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

**మణుగూరులో చిరుజల్లుల వర్షం**

మణుగూరు: మణుగూరు డివిజన్‌లో ఆదివారం సాయంత్రం వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. భీకర పెనుగాలులు డివి జన్‌లోని పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో భీభత్సాన్ని సృష్టించాయి. పినపాక మండలంలో ప్రధాన రహదారిపై మహావృక్షాలు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మణుగూరులో పెనుగాలులు వీచాయి. వర్షం చిరుజల్లులతో పాటు మొదలై ఓ మోస్తరుగా కురిసింది. నిన్నటి వరకుభరించలేని వడగాలులు, విపరీతమైన ఎండలతో సుమారు 46 డిగ్రీల ఉష్ణోగ్రతతో విలవిలలాడిన ప్రజలు ఆదివారం కురిసిన వర్షానికి కాస్త చల్లదనం ఏర్పడగా ఊపిరి పీల్చుకున్నారు.

**తడిసిన ధాన్యం.. నేలరాలిన మామిడికాయలు**

ములకలపల్లి: ములకలపల్లి మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షం, గాలి దుమారంతో ధాన్యం తడిసింది. దీంతో గాలిదుమారానికి మామిడికాయలు నేలరాలాయి. కల్లాల్లో ధాన్యం తడిసింది. కోతకు వచ్చిన మామిడికాయలు గాలికి పడిపోయాయి. అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ధాన్యం తడవకుండ పట్టాలు కప్పారు.

**కరకగూడెంలో తడిసిన ధాన్యం**

కరకగూడెం: మండల వ్యాప్తంగా ఆదివారం పెనుగాలులతో భీకర వర్షం కురిసింది. ఆరుగాలు కష్టపడి పండించిన ధాన్యం చేతికి వచ్చిన దశలో ఈ వర్షం తడిపి ముద్ద చేసింది. ఉరుములు మెరుపులు గాలివాన చేసిన భీభత్సానికి ప్రజలు ఇబ్బందులు పాలయ్యారు. అనేక గ్రామాల్లో వందలాది ఎకరాల ధాన్యం తడిసి పోయింది. అంగారుగూడెంలో 20 ఇండ్లపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయి తునాతునకలయ్యాయి. భారీ వృక్షాల కొమ్మలు విరిగిపోయి కరెంట్ తీగల పై పడిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా కుతీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని అనంతారం, గొల్లగూడెం, చొప్పాల, శ్రీరంగాపురం గ్రామాల్లో రాళ్ల వర్షం కురిసింది.

**ఇల్లెందు ఏరియాలో...**

ఇల్లందు: వేసవి ఎండ వేడిమితో తల్లడిల్లుతున్న ప్రజలు ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో ఊరట చెందారు. ఇల్లందు ఏరియాలో దాదాపు రెండు గంటల పాటు ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు నివాస గృహాల పైన రేకులు ఎగిరి పోయాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగీ పడ్డాయి.. విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఇల్లెందు పట్టణం అంధకారంలో కూరుకు పోయింది.

**పినపాకలో గాలివాన బీభత్సం**

పినపాక: ఆదివారం సాయంత్రం మండలంలో భీకర గాలిదుమారం తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. పెనుగాలులకు చెట్లు విరిగిపోయాయి. రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు పడిపోయాయి. కరెంటు స్థంభాలుకూడా విగిరిపోయాయి. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోట్లపల్లి గ్రామంలో పిడుగుపాటుకు ఓ పాడిగేద మృత్యువాత పడింది. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో భారీ వృక్షం విరిగిపడింది. గొట్టెళ్ల వద్ద ఏటూరునాగారం-మణుగూరు ప్రధాన రహదారిపై పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఎస్‌ఐ వెంకటప్పయ్య సత్వర చర్యలను చేపట్టారు.



జూలూరుపాడు మండలం మాచినిపేటలో ఈదురుగాలులు



వెంగన్నపాలెంలో మొక్కజొన్నపై పరదాలు కప్పుతున్న దృశ్యం

**అశ్వారావుపేట మండలంలో..**

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సాన్ని సృష్టించాయి. వానకు తోడు గాలులు బలంగా వీయటంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. మండలంలో నాలుగు గంటల వరకు తీవ్రంగా ఉన్న ఎండలు ఒక్కసారిగా తగ్గాయి. ఆరు గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మండలంలోని నందిపాడు, కుడుములపాడు, గాడ్రాల, వడ్డెర రంగాపురం, కోయరంగాపురం పరిసర ప్రాంతాల్లో గాలులు భీభత్సాన్ని సృష్టించాయి. పలువురి ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. రేకులు ధ్వంసం కావటంతో పలువురికి తీవ్రంగా నష్టం వాటిల్లింది. భద్రాచలం మార్గంతో పాటు పలు మార్గాల్లో రహదారులపై చెట్లు పడిపోవటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గాలుల వలన ఆయా గ్రామాల్లో దాదాపు 20 వరకు కరెంటు స్తంభాలు నేలకూలాయి. విద్యుత్తు శాఖకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఊహించన విధంగా ఒక్కసారిగా వచ్చిపడిన ఈదురు గాలులతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.



ములకలపల్లిలో తడిసిన ధాన్యం



గుండెపూడిలో నేలవాలిన చెట్టు



పినపాకలో నేలకూలిన వృక్షం



మణుగూరులో చల్లబడ్డ వాతావరణం



అశ్వారావుపేట మండలంలో పరిస్థితి

## సింగరేణి పీవీకే5 మైన్ కార్మికుల వితరణ



వితరణ అందజేస్తున్న కార్మికులు

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 21: సింగరేణి కొత్తగూడెం ఏరియా పీవీకే 5 ఇంక్లైన్ ఉద్యోగులు, కార్మికులు ఆదివారం భద్రాచలంలోని మానవసేవ అనాధాశ్రమానికి అవసరమైన నిత్యావసర వస్తువులతోపాటు వాషింగ్‌మిషన్, ఏసీ, ఫ్రిజ్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు సుమారు రూ.1. 25వేల విలువైన వస్తువులను అందచేయడం జరిగిందని, సింగరేణి కార్మికులు సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలబడటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏజెంట్ రవీందర్, మైన్ మేనేజరు పాలడుగు శ్రీనివాస్, వేల్ఫేర్ అధికారి అజయ్, యూనియన్ నాయకులు భూక్యా రమేష్, వై. శంకర్, బోరింగ్ శంకర్, సారయ్య, రమేష్, సాంబమూర్తి, కుమార్, కృష్ణ, సాయి, పవన్, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు 'తాటి' అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న తాటి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 21: అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కుమార్తె డాక్టర్ తాటి మహాలక్ష్మీ ద్వితీయ వర్ధంతి సందర్భంగా అశ్వారావుపేటలోని అమ్మా వృద్ధుల అనాథ సేవాసదనం, మందలపల్లిలోని రామాలయం వద్ద ఆదివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మా సేవాసదనంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి నిర్వాకురాలు అనసూర్యకు రూ.10వేల నగదును అందించారు.

## పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా

**జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి శ్రీనివాసరావు**

**దుమ్ముగూడెం మండలంలో పంటకోత ప్రయోగం**



పంటకోత దిగుబడి వేస్తున్న అధికారులు

కొత్తగూడెం/దుమ్ముగూడెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడులు అంచనా వేస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామంలోని రావులపల్లి కుద్వి సాగు చేస్తున్న పొలంలో ఐదుమీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పుతో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు తెలిపారు. మొదటి ప్రయోగంలో 7.285 కిలోలు, రెండో ప్రయోగంలో 14.735 కిలోలు ది గుబడి వచ్చిందని తెలిపారు. అనంతరం ఆయన సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఉన్న ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్ పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వరిపంట కోత ప్రయోగం వల్ల పంట దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెదర్ స్టేషన్ నితీరును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ నుంచి పరిశీలనకు వచ్చిన అధికారులు ఎం.రాంభద్రం, కె.వెంకట్రావ్, కె.తిరుపతిరావు, బి.ప్రతీప్, రూప్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

## అత్యధిక ఓట్లు సాధించాలి: పొదెం

భద్రాచలం, ఏప్రిల్ 21: జిల్లాలోని పినపాక, భద్రాచలం, ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోక్‌సభ మహబూబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయానికి అత్యధిక ఓట్లు సాధించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పోరిక సాయి శంకర్ అన్నారు. భద్రాచలంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్యను ఆయన మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూవహాలు, పార్టీ ప్రచారం, ఇతరత్రా వ్యవహారలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు.

## రైల్వే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 21: రైల్వే ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించే సమయాల్లో వ్యక్తిగత జాగ్రత్తతో పాటు రక్షణ సూత్రాలు తప్పక పాటించాలని కొత్తగూడెం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గిరియా సూచించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికుడు శ్రీనివాస్‌కు ఆదివారం కొత్త గూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్ అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సికింద్రాబాద్ డివిజన్స్ ఆపరేషన్ అమనాద్ - భద్రాచలం స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ విభాగం ఆధ్వర్యంలో పోగొట్టుకున్న ప్రయాణికుని మొబైల్ ఫోన్ ట్రాక్ చేసి చిరునామా కనుకొన్నారు. స్టేషన్‌లోని ప్లాట్ ఫారమ్‌పై తనిఖీలు చేస్తుండగా గమనించి రూ.16,800 విలువ కలిగిన ఓ కంపెనీకి చెందిన ఫోన్‌ను గుర్తించారు. తక్షణమే పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ నుంచి ప్రకటనలు చేసి ఆ మొబైల్‌ను భద్రపరిచారు. మొబైల్ యజమాని శ్రీనివాస్‌ల సమాచారాన్ని అందించి స్టేషన్‌కు వినిపించి మొబైల్‌ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు.

# మణుగూరు చేరిన ఈవీఎంలు

**పరిశీలించిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్**

మణుగూరు, ఏప్రిల్ 21: జరగనున్న పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగా పినపాక నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లు శనివారం రాత్రి మణుగూరుకు చేరుకున్నాయి. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది రెండు లారీలలో వచ్చి ఈవీఎంలను మణుగూరు జడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్ర పరిచారు. స్ట్రాంగ్ రూం లకు సీల్స్ వేశారు. అంతే కాకుండా స్ట్రాంగ్ రూంల వద్ద ప్రత్యేక సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని భద్రత నిమిత్తం ఏర్పాటు చేసినట్లు సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ఉర్షలిన్‌హైబెల్ తెలిపారు. ఈవీఎంలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్‌ఐలు శ్రీనివాస్, లీలావతి, మణుగూరు సీఐ సతీష్‌కుమార్, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

## 'మిషన్ భగీరథ'ను పట్టించుకోని అధికారులు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 21: మండలంలో మిషన్ భగీరథ నిర్వాహణా లోపాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వినీల్ ఆదివారం ఆరోపించారు. రూ.కోట్ల నిధులు ఖర్చు చేసినా మండలంలో సగానికి పైగా గ్రామాలకు తాగునీరు అందడం లేదన్నారు. మండలంలో జరిగిన భగీరథ పనుల్లో కాంట్రాక్టర్లు రూ.కోట్లాది దోచుకున్నారని ఆరోపించారు. విచారణ నిర్వహించి అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని ప్రభుత్వసొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు పూజారి సూర్యచంద్రరావు, సందీప్‌రెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ విధానాలపై నిరసనగా మేడే జరపాలి

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 21: కేంద్రంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా 138వ మేడే జరపాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి గండమళ్ల రామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందులో ఐఎఫ్‌టీయూ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాల్లో 29 చట్టాలను 4లేబర్‌ఫోర్స్‌గా మార్చి మిగతా 15 చట్టాలను అడ్రస్ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగు లేబర్‌ఫోర్స్‌లో కార్మిక సమ్మెపై అనేక ఆంక్షలు, 8గంటలు కన్న అధిక పని గంటలు చేయించుకోవచ్చన్న నిబంధనలతోపాటు పలు కార్మిక వ్యతిరేక విధానాలను రూపొందించారని ఆరోపించారు. అడ్డూ అదుపు లేకుండా కార్మికవర్గాన్ని దోచుకోవడానికి అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి, నాయకులు గోపాలరావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, సుందర్, శేషయ్య, వేముల గురునాథం పాల్గొన్నారు.

## మైనింగ్ సిబ్బంది నిరసన

మణుగూరుటౌన్, ఏప్రిల్ 21: ఏరియాలోని పీకేఓసీ-2 గనిలో విధులు నిర్వహిస్తోన్న ఓవర్‌మెన్‌ను క్వారీ నుంచి బయటకు పంపడాన్ని నిరసిస్తూ మైనింగ్ సిబ్బంది ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం మైనింగ్ స్టాఫ్ కాలరీస్ మేనేజర్ శ్రీరామ్ శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీ సురేందర్‌కుమార్ మాట్లాడారు. ఉత్పత్తి ఉత్పాదకతల్లో కీలక పాత్ర పోషించేది మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్‌ను విధుల నుంచి బయటకు పంపించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా యాజమాన్యం చూడాలని కోరారు.

## 24న బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశం

మణుగూరు, ఏప్రిల్ 21: ఈ నెల 24న మణుగూరులోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు పోశం నర్సింహారావు, అప్పారావు, ముత్యంబాబు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన ఈ జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ , ఎంపి అభ్యర్థి మాలోత్ కవిత హాజరు కానున్నట్లు పేర్కొన్నారు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యులు జావెద్ పాషా, వట్టం రాంబాబు, యాదగిరి గౌడ్, ఎస్ రమేష్, ముద్దంగుల కృష్ణ, అక్కి నర్సింహారావు, కుంటా లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

అశ్వాపురం, ఏప్రిల్ 21: మండలంలో ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా పలువివాహది శుభకార్యాలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నూతన దంపతులు ఒర్రె సాయికుమార్-స్వాతి, టేకులగుట్ట గ్రామంలో తొర్రికొండ మానస-ఫణికుమార్, గరిబడ్డ గ్రామంలో పొడియం శ్రావణి-సాయికిరణ్ దంపతులను ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేశారు

**నూతన జంటను ఆశీర్వదించిన తుళ్లూరి**

మండల పరిధిలోని టేకులగుట్ట గ్రామానికి చెందిన తొర్రికుండ మానస-ఫణికుమార్ నూతన వధూవరులను ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, ఎంపిటిసిలు కమటం నరేష్, గాదెజయ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పాయం

## సభకు తరలివెళ్లిన నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 21: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర మహాసభ గోదావరిఖనిలో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు కొత్తగూడెం కార్పోరేట్, ఏరియాలకు సంబంధించిన ఐఎన్‌టీయూసీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించేందుకు ఈ మహాసభను నిర్వహించినట్లు కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్ తెలిపారు. ఐఎన్‌టీయూసీ శ్రేణులను గోదావరిఖనికి భారీగా తరలించామన్నారు. మహాసభలకు రాష్ట్ర మంత్రులతోపాటు కోల్‌బెల్టు ఏరియాలకు చెందిన కాంగ్రెస్ శాసనసభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు గోపు కుమార్, భీముడు, చిలక రాజయ్య, కుమారస్వామి, మోహన్‌రెడ్డి, కొప్పుల కుమార్, పోశం శ్రీనివాస్, షఫ్రక్ తదితరులు పాల్గొన్నారు.